ఆడ మనిషి ఒడ్డు మీద తల్లడిస్తున్నది. ఇద్దరం ఆడికి చేరుకున్నం. పోలీస్ పటేల్ భార్య పొట్టతోటి ఉన్నది. బర్రె గడ్డికి అచ్చిందేమో! నొప్పులతోటి పడిపోయింది. హల్లు హల్లు రాస్తా తక్ లేకే ఆయి నసీంబీ. పోతుల బండిగట్టు కొచ్చి, మెత్తగ బొంతలు వరిసి పండుకోబెట్టి, వాన గుర వంగ.. ఒర్రె జోరు పెరిగినా.. ధైర్యంతోటి దాటించిన. ఆమె ముఖం మీద చినుకులు పడకుండా జోరతట్టు అడ్డం పట్టింది నసీంబీ. వాన ఇంకా జోరందుకుంది. ఊరు దగ్గర బుడుగుల పయ్య దిగబడ్డది. భుజంతోటి గట్టిగ ఎత్తి దాటించే వరకు కడుపులో పేగులు నోట్లో కచ్చినట్టయింది. కట్టపడి పటేల్ ఇల్లు చేరినం. పటేలు పట్నం పోయిండు. మంత్రసాని మంగలి ముత్తవ్వ అచ్చి చూసింది. 'రాజక్కా! బిడ్డ అడ్డం దిరిగింది. తొలి కాన్పు ఇక్కడ కాదు. జల్ది ఇల్లంతకుంట దావఖాన్లకు పోనీ.. లేకపోతే పటేల్‌తోని మాట వస్తది' అన్నది. ఇంటి పక్క ఎల్లక్క, రాజక్క ఎంబడి వచ్చిండ్రు. పోతుల బండిని గెదిమిన! ఇల్లంతకుంట శేరుకున్నం. డాక్టరు రమణమ్మ వెంటనే ఆపరేషన్ చేసి బిడ్డను తల్లిని కాపాడింది. 'సమయానికి వచ్చిండ్రు! కాబట్టి ఇద్దరూ క్షేమంగ ఉన్నరు' అని శెప్పింది. మేము సంబురవడ్డం. చంద్రారెడ్డి పటేల్ అచ్చినంక నన్ను పిలిపించి మెచ్చుకున్నడు. ఇట్ల మస్తు మందికి సాయం చేసిన!'' శెప్పిండు ఖాశీం.

''ఖాశీంజీ! ఆ చంద్రారెడ్డి కొడుకును నువ్వు చూసినవా? ఇప్పుడు ఏం చేస్తుండో తెలుసా? ఎట్లున్నడో తెలుసా?'' అని ప్రశ్నించిండు డాక్టర్. ''అయ్యా! పటేల్ను నేను అడుగుతనా!? పట్నంల ఉన్నడనంగ ఇన్న'' అన్నడు ఖాశీం.

కుర్చీలోంచి లేచి.. ఖాశీంను ఆత్మీయంగా అలుముకుండు.. కళ్లల్లో నీళ్లు చెమ్మగిల్లంగ డాక్టర్ కాశిరెడ్డి.

''నేనే తాతా! చంద్రారెడ్డి కొడుకును. నీపేరే పెట్టుకున్నరు నాకు. నాపేరు కాశిరెడ్డి!'' శెప్పిండు డాక్టర్.

''అయ్యా! నేను చేసిన పుణ్యం ఫలించింది. అల్లా లెక్క నువ్వుండంగ ఇంగ నాకేం గాదు!'' అని సంబురంతోని కండ్లల్ల నీళ్లు దెచ్చుకున్నడు ఖాశీం.

గప్పుడే రిపోర్టులు అందినయి. డాక్టరు చూసిండు. అప్పటిదాకా సంతోషంగ ఉన్న ఖాశీంకు.. ఏమని చెప్పాలో! ఎట్లని చెప్పాలో! తోచక కండ్ల నిండ కన్నీళ్లు నిండుకున్నయ్ డాక్టర్‌కు. చెప్పక తప్పదనుకున్నడు.

''ఖాశీం తాతా! నీకు అల్లా అన్యాయం చేసిండు. కాలు తీసెయ్యాలె. అయినా గ్యారెంటీ లేదు. పానాలకు ప్రమాదం ఏర్పడ్డది'' అని కుండబద్దలు కొట్టినట్టు ఆవేదనతో చెప్పిండు కాశిరెడ్డి డాక్టర్.

''ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మీ ధర్మంగా భావిస్తున్నందుకు అభినందిస్తున్న! ఖాశీంను ముందు దోలుకొస్తే బాగుండేది దయాకర్!ఇప్పటికైనా జల్ది నిర్ణయం తీసుకోండి. కాలు తీసెయ్యాలె! లేకుంటె ప్రాణాలకే ప్రమాదం'' అని చెప్పిండు డాక్టర్.

''అయ్యా! నా మొగుడు కళ్ల ముందటి పానాలతోటి ఉండాలె. కూలి నాలి చేసుకొని సాదుకుంట!'' అని ఏడుసుకుంటనే శెప్పింది నసీంబీ.

ఆ మాటలు విన్న డాక్టర్ వెంటనే ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లి.. కాలు తొలగించిండు. వారం రోజులు దవాఖాన్లనే ఉన్నరు.

ఖర్చులు లేకుంట ఇల్లు చేరుకుండ్రు.

'మంచంలనే పండి ఉంటే.. నా గుడ్డి పిల్లలు ఎట్ల బతుకుతరు? నా నసీంబీ కైసా ఎల్ల దీస్తది? నాకేమన్న యితే నా పరివార్ క్యాహోగా?' ఈ ప్రశ్నలన్నీ ఖాశీం దిమాక్‌ను తొలుస్తున్నయి.

రోజురోజా మనుసులనే కుములుతున్నడు. గంపెడంత దుఃఖం.. మానేరు అలల్లా తన్నుకొచ్చి, కన్నీళ్లు టప్పటప్ప రాలుతున్నయి.

పోతులను, బండిని అమ్మేసిండు. సర్కారు ఇచ్చిన పించిని పైసలతోని పూట గడుత్తంది.

గుట్ట సుట్టు మొలిసిన పచ్చగూర, గునుగు కూర, తెల్ల గలిజేరు, పొన్నగంటి కూరలే.. ఆళ్ల కడుపులు నింపుతున్నయి.

ఓనాడు ధైర్యం తెచ్చుకుండు.

''నసీంబీ! నువ్వు నాకు ఇమ్మతిస్తే గుట్టెక్కి గుండ్లకు తొళ్లు కొడుత. నువ్వు పెద్ద సుత్తెతోని కొడుదువు!'' అన్నడు.

అట్ల కొంతకాలం బతుకు ఎల్లతీసిండ్రు.

ఓనాడు దయాకర్ రావును కలిసింది నసీంబీ.

''అయ్యా! కట్టెపుల్లోలె ఎండుకొస్తుండు నా మొగుడు. మల్లొకపారి సిరిసిల్ల దావఖాన్లకు తోలుకపొండ్రి! మీకు సలాంజేత్త!'' అని దీనంగ బతిమ్లాడింది.

ఎంటనే ఆటో మాట్లాడి సిరిసిల్ల దావఖానకు తీసుకపోయి.. కాశిరెడ్డి డాక్టర్‌కు చూపించిండు. పరీక్షలు చేయించి, రిపోర్టులు పరిశీలించి..

''ఖాశీం తాతా! నిన్ను అల్లా చిన్నసూపు చూసిండు. నీ పెయ్యంత పాయిజన్ అయింది. నేనేం చేయలేని పరిస్థితి ఎదురైంది. నిన్ను కాపాడుదామని నా మనసులో ఎంత ఉన్నా సాధ్యం కాని పని''.. అని కంటతడి పెట్టిండు డాక్టర్ కాశిరెడ్డి.

నసీంబీ గుండెల పిడుగు పడ్డట్లయింది. గంపెడు ఏడుపుతో ఇంటికి చేరిండ్రు. అంతదాకా కొట్టిన రాళ్లు అమ్మేసింది. ఆకలి బాధకు పిల్లలు తట్టుకోవడం ఓ నరకమైంది. మనసులో తుఫాను చెలరేగింది. ఊర్లోకి పోయింది. ఓ అరుగు మీద కూకుంది. కన్నీళ్లు కారికారి ఇంకిపోయినయి. 'అయ్యో! పాపం!' అని మనిషికింత కూడు, కూర, తొక్కు, చలి కూరలు పెట్టిండ్రు. దాన్ని పిల్లలకు పెట్టి.. మగనికి తినిపించి తాను తిన్నది. సిగ్గు విడిచి మనసు రాయి చేసుకుని ఉంటె పిల్లలు బతుకుతరు అనుకున్నది.

'ఎవరు ఎన్ని తిట్టినా.. గొంగెడు కావు' అనుకుంది. ఇజ్జత్‌ను సంపుకొన్నది. ఊళ్లె బిచ్చమెత్తింది.

ఓ వారం రోజులదాకా అందరూ ఆదరించిండ్రు. కొందరు ఈసడింపులు మొదలుపెట్టిండ్రు. బువ్వ పెట్టిన వాళ్లను.. 'అవ్వ ఇంత తొక్కేయి!' అంటె.. 'పాపమని పటెవెడు అంబలి పోస్తే కారం లేదని కచ్చీరుకెక్కిందట.. నీ అసొంటిది' అని దెప్పిపొడిచిండ్రు. సూదులోలే మనసుకు తగిలి తగిలి మొద్దు బారింది. ఓనాడు రాత్రంతా కాకి శోకమైంది. తెల్లార చుక్క పొడిచే దాకా ఖాశీం అవస్థ చూస్తూనే ఓదార్సుకుంటనే ఉన్నది.

ఒక్కసారిగా..

''నసీంబీ.. నువ్వూ, పిల్లలు ఎట్ల బతుకుతరు? యా అల్లా!'' అని పెద్దగ అరిసి, ఇరుగ చూసి సల్లవడ్డడు.

తెల్లారి సుక్క పొడిశింది. సుక్కల్లో సుక్కయ్యిండు ఖాశీం. నసీంబీ గుండెలో తుఫాను చెలరేగి, గుండె చెరువైంది. గుండెలో కుంపటి రగులుతుంది. కానీ, పైకి ఏడిస్తే గుడ్డి పిల్లలు గుండె పగులుతరని పిల్లలకు చెప్పకుండనే.. మస్కులనే ఊర్లకు పోయింది. సర్పంచ్, పటేల్, పట్వార్లను కలిసి బోరున గుండె పగిలేట్టు ఏడ్చింది. ఈ వార్త ఊరంతా పాకింది. ఖాశీంను చూడ్డానికి దారి వడ్డరు.

'అయ్యో! కీర్ తాత! ఎంత మంచోడుండె!' అని పిల్లలు – పెద్దలు చూడ్డానికి శీమలదారోలె పోతున్నరు. కన్యారం నుంచి గుడ్డి కొడుకుల్ని రప్పించిండ్రు. నలుగురు గుడ్డి పిల్లలు పుణుకుతూ ఏడుస్తూ ఉంటే.. చూసే వాళ్ల గుండెలు అవిసిపోతున్నయి. రాయి అసొంటి మనసున్నోళ్ల ఎదలు గూడ చెమ్మగిల్లి కన్నీరు ఒలికింది. ఊళ్లోని పకీర్ రహీం, అబ్బాస్‌ను పిలిపించి ఇస్లాం పద్ధతి ప్రకారం ఊరు పెద్దలు కలిసి నిలబడి అంత్యక్రియలు చేయిస్తున్నరు. నసీంబీ గోడైంది. ఏడుపు లేదు. కన్నీరు రావడం లేదు. శవయాత్ర మొదలైంది. ఇస్లాం పద్ధతి ప్రకారం ఆడవాళ్లు ఖబ్రస్తానుకు రావొద్దని ఆపినోళ్లను కొరికి.. ఇనకుండ ఎంటబడి పోతనే ఉంది నసీం. ఖాశీం శవాన్ని బొందలో పెట్టిండ్రు. గంతే ఒక్కసారి పెద్దగా కేక వేసి..

''నా ఖాశీంను కైకు ఖబర్ మే డాలే!'' అంటూ అరిసి..

''ఖాశీంజీ! తుమారేసాత్ మైబీ ఆరూం!'' అంటూ గుండెపగిలి కుప్పకూలింది నసీంబీ.

పక్కనున్న వాళ్లు నీళ్లు తాగిస్తే కారి పోయినయి. శ్వాస చూసిండ్రు. దాతు చూసి.. ప్రాణం వదిలిందని నిర్ధారించిండ్రు. కొద్దిసేపు నిశ్శబ్దం నిండుకుంది. అందరి కండ్లూ చెమ్మగిల్లినయి.

'వీళ్లది జన్మజన్మల విడదీయరాని కన్నీళ్ల బంధం!' అని ఇద్దరినీ ఒకే బొందలో.. 'జోడి ఖబర్' సమాధి చేసిండ్రు.

ఊరంతా పిల్లలకు అండగా నిలిచిండ్రు.

డిగ్రీ చదువుకున్న ఇద్దరు కొడుకులు ఉద్యోగం కోసం నిరీక్షిస్తున్నరు. ■

## డాక్టర్ జనపాల శంకరయ్య



తన రచనల ద్వారా పల్లె జీవితాలను ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు డాక్టర్. జనపాల శంకరయ్య. రాజన్న సిరిసిల్ల జిల్లా ఆవునూరు ఈయన స్వస్థలం. ఏడో తరగతితోనే చదువు కొండెక్కింది. అయినా, ఉన్నత విద్యాభ్యాసంపై మక్కువతో వృత్తి, వ్యవసాయం చేస్తూనే.. ప్రైవేట్‌గా ఎంఎ, ఎంఫిల్, పీహెచ్‌డీ చేశారు. ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయుడిగా 33 ఏళ్లపాటు సేవలందించారు. జిల్లా, రాష్ట్ర స్థాయుల్లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు అందుకున్నారు. పద్య, వ్యాస, నాటిక, వచన కవిత, ఏకపాత్ర, ఒగ్గుకథ, బుర్రకథ, కథా ప్రక్రియల్లో అనేక రచనలు చేశారు. కరీంనగర్ జిల్లా లంబాడీల ఆచార వ్యవహారాలు, తెలుగు లంబాడీల గేయ సాహిత్యం, ఆచార్యదేవోభవ శతకం, బహుముఖ ప్రజ్ఞాశాలి కల్వకుంట్ల తారక రామారావు బుర్రకథ బాలగీతాలు రచించారు. తెలంగాణ సమరశంఖం, అవినీతిపై అక్షరాంకుశం, పర్యావరణ పరిరక్షణ పాంచజన్యం, వైద్యం – ఆరోగ్యం మొదలైన సంకలనాలకు సంపాదకత్వం వహించారు. సినారె 64 వసంతాలు, అంతర్జాతీయ ఇందిరాగాంధీ, కళాలయ విశిష్ట సాహిత్య, సిరివెలుగులు, పురిటిగడ్డ మొదలైన అవార్డులు అందుకున్నారు. 'నమస్తే తెలంగాణ – ముల్కనూరు ప్రజా గ్రంథాలయం' కథల పోటీల్లో ముచ్చటగా మూడు బహుమతులు గెలుచుకున్నారు.